అక్కచెల్లెమ్మల సాధికారతకు ప్రాధాన్యం


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆమంచి


చెక్కు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్

- ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకే పెద్దపీట
- నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

పర్చూరు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ అన్నారు. మంగళవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో వరుసగా మూడో ఏడాది వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొని 1173 గ్రూపులకు చెందిన 11,515 మంది సభ్యులకు మంజూరైన ఆసరా నిధులు రూ.10.40 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పటి చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చెప్పి మహిళలను నిట్టనిలువునా మోసం చేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక సంఘాల రుణాలను విడతల వారీగా మాఫీ చేసి మహిళలను ఆదుకున్నారని కొనియాడారు. సీఎం జగన్ అన్ని సంక్షేమ పథకాల్లోనూ మహిళలకే అగ్రతాంబులం ఇచ్చి మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. ఈప్రభుత్వంలో మహిళలు గర్వంగా బతుకుతున్నారన్నారని, వారికి ఒక అన్నగా, ఒక తమ్ముడిగా అండగా నిలిచిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి ఆమంచి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి, సర్పంచ్ మల్లా అంజమ్మ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు కోట ప్రసన్నశ్రీనివాసరావు, పాలేరు వీరయ్య, పర్చూరు మండల కన్వీనరు కఠారి అప్పారావు, ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, పర్చూరు మాజీ ఏఎంసీ చైర్మన్ జువ్వా శివరాంప్రసాద్, దేవరపల్లి ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్, మండల జేసీఎస్ కన్వీనరు ముప్పాళ్ల రాఘవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు జంగా అనీల్, ఆకుల హేమంత్, గోరంట్ల శివకుమారి, తులసీ నాగమణి, గాదె సురేష్, దగ్గుబాటి రామకృష్ణ, వై.పాపారావు, అడపా సుధాకరరెడ్డి, కొల్లా శ్రీహరి, కుక్కపల్లి నాగేశ్వరరావు, జెట్టి చంద్రం, ఏపీఎం లాజరు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకే 'ఆసరా'


ఆసరా చెక్కులు అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: మహిళలు ఆర్థికంగా ముందుకు నడిచినప్పుడే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆసరా చెక్కులు చైతన్య అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ ప్రకారం మూడో విడత ఆసరా నగదు విడుదల చేసినట్లు చెప్పారు. మండలంలో మొత్తం 1071 పొదుపు సంఘాలకుగాను 10557 మందికి రూ.8.48 కోట్లు పంపిణీ చేశామన్నారు. పొదుపు సంఘాల ద్వారా లబ్ధిపొందిన వారు ఆసరా సొమ్మును సరైన అవసరాలకు వినియోగించుకోవాలన్నారు. గత ప్రభుత్వం లో డ్వాక్రా గ్రూపులకు రుణమాఫీ చేస్తానని చెప్పి అక్క చెల్లెమ్మలను మోసం చేశారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగనన్ననే గెలిపించుకుంటే మరెన్నో ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు పొందేందుకు వీలు కలుగుతుందని చైతన్య తెలిపారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, ఏపీఎం అనూరాధ, వెలుగు సిబ్బంది, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాతల సహకారం అభినందనీయం


రామాపురంలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మాయపాలెం మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమం రోటరీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ట్రజరర్ తమ్మన శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు కరి రామయ్య, కేవీ శ్రీనివాసరావు, డాక్టర్ యూ దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

వేటపాలెం: మండల పరిధిలోని రామాపురం మత్స్యకార గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ రామాపురం స్కూల్‌ను క్లబ్ దత్తత తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పోలుదాసు రామకృష్ణ, స్వామి, హెచ్‌ఎం నారాయణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీతో కూడిన రుణాలు

అద్దంకి: రైతు ఉత్పత్తిదారుల సంఘ ఏర్పాటుతో రాయితీ కూడిన రుణాలు రైతులకు అందుతాయని ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం రైతు సంఘ ఏర్పాటు కోసం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ సంఘం ఏర్పాటుతో రైతులకు రుణాలే కాకుండా సలహాలు సూచనలు ఇస్తారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర పొందే వీలు సంఘం ద్వారా కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐదురుగు మహిళా రైతులు డైరక్టర్లను ఎంపిక చేశారు. వారిలో మందా సామ్రాజ్యం, పాలపర్తి వాణి, సరభి వజ్రం, కందిమళ్ల అనురాధ, గురజాల శివ కుమారి ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, ఎఫ్‌పీజీ లీడర్లు పాల్గొన్నారు.

గంజాయి, నాటుసారా నిర్మూలనే లక్ష్యం


తనిఖీలు చేస్తున్న టూటౌన్ సీఐ సోమశేఖర్, సిబ్బంది

చీరాల టౌన్: చీరాల టూటౌన్ పరిధిలో గంజాయి, నాటుసారా అమ్మకాలు, తయారీ లేకుండా పూర్తిగా నిర్మూలించడమే మొదటి లక్ష్యమని టూటౌన్ సీఐ సోమశేఖర్ అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని రోశయ్య కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో చీరాల పట్టణం, రూరల్ సీఐలు వి.మల్లికార్జునరావు, సోమశేఖర్, మల్లిఖార్జున, ఎస్సైలు, 40 మంది పోలీసు బృందంతో కలిసి సెర్చ్ నిర్వహించారు. రోశయ్య కాలనీలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేసి అనుమానిత వస్తువులు, వ్యక్తుల వివరాలను సేకరించారు. సెర్చ్‌లో ఎస్సైలు సురేష్, జనార్దన్, చంద్రావతి, సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న ఆంజనేయ అవతార తత్వం

అద్దం రూరల్: నైమిశారణ్య పీఠాధిపతులు, హిందూ ధార్మిక సేవా సంస్థల వ్యవస్థాపకుడు బాల బ్రహ్మానంద సరస్వతి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన హనుమాన్ చాలీసా, ఆంజనేయ అవతార తత్వం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కష్టాల్లో ఉన్నవారు హనుమాన్ చాలీసా చదువుకుంటే కష్టాలు కరిగిపోతాయన్నరు. భగవంతుడు భక్తులకు అనుబంధాన్ని, అనురాగాన్ని తెలియపరుస్తుందన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

పర్చూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమంచి మాట్లాడుతూ 2014లో చంద్రబాబు జన్మభూమి కమిటీలు పెట్టి టీడీపీ వారికే సంక్షేమ పథకాలు అందించారిన విమర్శించారు. పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కుల, మత, వర్గాలకు, పార్టీలకు సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మరలా 2024లో రెండోసారి 175 సీట్లు సాధిస్తామన్నారు. ఇంటింటికీ అంటించే «మా నమ్మకం నువ్వే జగనన్న» స్టిక్కర్లు, బ్రోచర్లను ఆమంచి విడుదల చేశారు. కార్యక్రమానికి మండల కన్వీనర్ కఠారి అప్పారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి, హిస్టరీ అకాడెమీ డైరెక్టర్ జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, వైస్ ఎంపీపీలు కోట ప్రసన్న శ్రీనివాసరావు, పాలేరు వీరయ్య, సర్పంచ్ మల్లా అంజమ్మ శ్రీనివాసరావు, మండల జేసీఎస్ కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య, దేవరపల్లి ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆమంచి కృష్ణమోహన్

తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక అవసరం

యద్దనపూడి: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో అధికారులందరూ సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో కృష్ణకుమారి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీపీ పులగం రజనీ అధ్యక్షత వహించారు. తొలుత అన్నిశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రజనీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యుత్‌శాఖ ఏఈ సురేష్ మాట్లాడుతూ తనుబొద్దివారిపాలెం ఎస్సీ కాలనీలో విద్యుత్‌స్తంభాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని వారంరోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. చిలకలూరిపేట ఆర్టీసీ కంట్రోలర్ శివరామ్ మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు ఏర్పాటు చేశామని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ఉచితంగా పరీక్ష కేంద్రానికి వెళ్లవచ్చన్నారు. జెడ్పీటీసీ చుండి లక్ష్మినారాయణమ్మ, వైస్ ఎంపీపీలు చిలుకూరి నాగరత్తమ్మ, ఐమ్యాల శ్యాంసన్, కార్యక్రమంలో పీఆర్‌ఏఈ సురేష్, ఏపీఎం వెంకట్రావు, వైద్యాధికారి నిహారిక, పశు వైద్యాధికారి సురేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఏఈ సురేష్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండోరోజు మంగళవారం కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్తూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, అందుతున్న తీరును గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు సకాలంలో పింఛను అందిస్తున్నారా లేదా అని, అందుబాటులో ఉంటున్నారా అని అడుగుతూ చైతన్య ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్న కుమారి, సర్పంచ్ ఆదిలక్ష్మీ, మందా పిచ్చయ్య, రావూరి సుందరబాబు, కొట్టే సుబ్బారావు పార్టీ నాయకులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వృద్ధుడికి నమస్కరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అంగన్‌వాడీ కేంద్రం తరలించొద్దని ఆందోళన

కారంచేడు: గత 22 ఏళ్లుగా ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, సెంటర్‌ను తరలించడానికి వీలు లేదని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కేశవరప్పాడు ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల ఆవరణలో నుంచి వేరే చోటకు తరలించడానికి కొంత మంది ప్రయత్నిస్తున్నట్లు తెలిసిన సమాచారంతో చిన్నారుల తల్లులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సెంటర్ మా ఇళ్లకు దగ్గరగా ఉంటుందని, దీనిని వేరే చోటకు తరలిస్తే మా చిన్నారులను పంపించడానికి దూరం అవుతుందని వారు వాపోయారు.


ఆందోళన చేస్తున్న చిన్నారుల తల్లులు

సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలి

యద్దనపూడి: సామాజిక తనిఖీ నిర్వహించే బృందసభ్యులకు ఉపాధిహామీ సిబ్బంది పనుల సమాచారాన్ని అందించి సహకరించాలని ఉపాధిహామీ సామాజిక తనిఖీ డీఆర్పీ బోస్ సూచించారు. మంగళవారం 14వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ సిబ్బంది, సామాజిక తనిఖీ ఆడిట్ బృందాలకు మధ్య సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ బోస్ మాట్లాడుతూ ఉపాధిహామీ సిబ్బంది ఇప్పటి వరకు గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించిన రికార్డులు, తనిఖీ సభ్యులకు చూపిస్తే తనిఖీ సక్రమంగా నిర్వహించేందుకు వీలవుతుందన్నారు. సామాజిక తనిఖీకు సంబంధించి 30వ తేదీ సూరవరపుపల్లి, యనమదల, పెద్దివారిపాలెం, 31వ తేది పూనూరు, జాగర్లమూడి, ఏప్రిల్ 1వ తేదీ అనంతవరం, తనుబొద్దివారిపాలెం, 2వ తేదీ గన్నవరం, పోలూరు, శ్యామలవారిపాలెం, 3వ తేదీ మున్నంగివారిపాలెం, 4వ తేదీ యద్దనపూడి, వింజనంపాడు, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. 5వ తేదీ మండల పరిషత్ కార్యాలయంలో మండల సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రమేష్‌బాబు, ఉపాధిహామీ సిబ్బంది, తనిఖీ బృంద సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కారంచేడు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కుంకలమర్రు 1,2లలో బీసీ-డీ, బీసీ-డీ మహిళ, బీసీ-బీ మహిళ, నాయుడువారిపాలెంలో బీసీ-ఏ మహిళ, తిమిడెదపాడు బీసీ-ఏ జనరల్ కేటగిరిలో అర్జీలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్ 11వ తేదీ లోగా అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. అర్హులను ఎంపిక చేసి మే 4వ తేదీన నియమక పత్రాలు అందిస్తామన్నారు.

నేడు మండలంలో ఆసరా చెక్కుల పంపిణీ

చినగంజాం: వైఎస్సార్ ఆసరా పథకం చెక్‌ల పంపిణీ కార్యక్రమం బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు గృహ సారథులకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని, అనంతరం ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

నేడు వైఎస్సార్ అసరా పంపిణీ..

అద్దంకి రూరల్: స్థానిక సంతమాగులూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎం మంగళవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణచైతన్య పాల్గొంటారని తెలిపారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

గాలికుంటు వ్యాధిపై జాగ్రత్తలు అవసరం


అవగాహన కల్పిస్తున్న పశుసంర్ధకశాఖ జేడీ హనుమంతరావు

చినగంజాం: గాలికుంటు వ్యాధిపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు అన్నారు. 30వ జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కడవకుదురు గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులు వలన దుష్ఫలితాలు కలుగుతాయని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక గాలికుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. 102 గేదెలకు, 34 దూడలకు టీకాలను వేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నక్కల శ్రీనివాసరావు, చీరాల ఏరియా వైద్యశాల పశు వైద్యులు డాక్టర్ సజ్జా చిట్టిబాబు, సంతరావూరు పశువైద్యులు డాక్టర్ తాటిపర్తి శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా పంటనష్ట నివేదికలు


నేలవాలిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న అధికారుల బృందం

బల్లికురవ: అకాల వర్షంతో మండలంలో నష్టపోయిన పంటల నివేదికల్లో అవకతవకలకు తావివ్వకుండా పకడ్బందీగా పూర్తిచేయాలని చీరాల వ్యవసాయాధికారిణి సుమతి కోరారు. మంగళవారం ఆమె మండలంలోని బల్లికురవలో పంట నష్టం జాబితాల తయారీపై వీఆర్‌వోలు, వీఏఏలు, వ్యవసాయ శాఖ వీఏఏలు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసుకుని 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోతేనే పంటనష్టం జాబితాలో చేర్చాలన్నారు. గ్రామ మండల రెవెన్యూ డివిజన్ల వారీగా బృందాలు నష్టం జాబితాలను పరిశీలిస్తారన్నారు. అనంతరం బల్లికురవలో నష్టపోయిన మొక్కజొన్న పంటను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ఎస్‌వీపీ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోగులకు మేలు


కుంకలమర్రులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జెస్సీరాణి

చినగంజాం: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పీ సాయిశ్రీ చరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామం, యానాది సంఘం కాలనీలో ఆయన 104 సిబ్బందితో కలిసి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరం నందు సుమారు 55 మందికి పైగా జలుబు, దగ్గు, జ్వరం, బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తల సిబ్బంది పాల్గొన్నారు.

కారంచేడు: గ్రామాల్లోని ప్రతి పేద వారి ఇంటికే ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తుందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కే జెస్సీరాణి అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని కుంకలమర్రు తుఫాన్ షెల్టర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 89 మందికి పరీక్షలు నిర్వహించామని ఆమె తెలిపారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

వేటపాలెం: అంగన్‌వాడీల పరిధిలోని చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ పుష్పవల్లి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వేటపాలెం సెక్టార్‌లో పోషణ్ పక్వాడా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రతి రోజు కేంద్రాల్లో చిన్నారులకు గుడ్డు, పాలు అందించాలని ఆదేశించారు. గ్రామాల పరిధిలోని గృహాలను సందర్శించి గర్భిణులు, బాలింతలు, పిల్లలకు రక్తహీనత లేకుండా పౌష్టికాహార లోపం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, బాలికలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బల్లికురవ: పోషకాహారం తీసుకోవడం వలన గర్భిణులు, బాలింతులు చిన్నారులల్లో రక్తహీనత నిర్మూలనతో పాటు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలోమి అన్నారు. మంగళవారం కొప్పరపాడు సెక్టారు పరిధిలోని ఎస్‌ఎల్ గుడిపాడు బీసీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పసల అంజలి, హెచ్‌ఎం పుణ్యవతి పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

మేదరమెట్ల: ఓ మహిళ ఇంట్లో టీవీ చూస్తున్న సమయంలో ఓ ఆగంతకుడు ఇంట్లోకి వచ్చి మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల తూర్పుపాలెంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన రేగుల తులశమ్మ రాత్రి సమయంలో ఇంట్లో టీవీ చూస్తోంది. స్కూటీపై వచ్చిన ఓ వ్యక్తి ఇంట్లోకి వచ్చి తులశమ్మ మెడలోని బంగారు గొలుసును లాక్కొని వెళ్లిపోయాడు. గొలుసు సుమారు రెండు సవర్లు, విలువ రూ.45 వేలు ఉంటుందని దీనిపై మంగళవారం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.